క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేమూరు: 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ కోడిపర్రు ఫీడర్ విద్యుత్ లైన్‌ల మరమ్మతులు చేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ గోపి తెలిపారు. కోడిపర్రు ఫీడర్ పరిధిలోని బలిజేపల్లి, వరహాపురం, బేతాళపురం, బూతుమల్లి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

కొల్లూరు : విద్యుత్ సబ్‌స్టేషన్‌ల మరమ్మత్తుల నేపథ్యంలో శనివారం మండలంలోని రెండు సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కె.సుధాకర్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొల్లూరు సబ్ స్టేషన్ పరిధిలోని కొల్లూరు, క్రాప, రావికంపాడు, తాడిగిరిపాడు, అబ్బనగూడవల్లి, దోనేపూడి, కోటిపల్లి, చినపులివర్రు, గాజుల్లంక, పెసర్లంక, ఆవులవారిపాలెం గ్రామాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అలాగే ఈపూరులంక సబ్‌స్టేషన్ పరిధిలోని సుగ్గునలంక, చిలుమూరులంక, అన్నవరపు లంక, కనిగిరిలంక గ్రామాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాకు ఆటంకం ఉంటుందన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

రేపల్లె రూరల్: పట్టణంలో 5వ వార్డు నైట్ షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న నిరుపేదలకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు దాసరి స్వతంత్రప్రసాద్ జ్ఞాపకార్థం ఆయన భార్య అడుసుమల్లి ఝాన్సీలక్ష్మి దుస్తులు, పండ్లు శుక్రవారం పంపిణీ చేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్వతంత్రప్రసాద్ జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా ఝాన్సీలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో విజయభారతి, శ్రీలక్ష్మి, నైట్ షెల్టర్ నిర్వాహకుడు కొండపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో భోగి పండ్ల వేడుక



కొల్లూరు : సంక్రాంతి వేడుకలలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలలో భోగి పండ్ల వేడుక నిర్వహించారు. శుక్రవారం మండలంలోని బొద్దులూరుపాడు అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ అమృతలూరు సెక్టార్ సీడీపీఓ జి.విజయలక్ష్మి అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు భోగి పళ్లు పోశారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ పి.విజయరాణి, సూపర్‌వైజర్ టి.విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త బి.నాగరాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల పట్టణ సీఐగా రాంబాబు



బాపట్ల: బాపట్ల పట్టణ సీఐగా రాంబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ సెల్ విభాగంలో పని చేస్తున్న రాంబాబును బాపట్ల టౌన్ సీఐగా బదిలీ చేశారు. సీఐగా పని చేస్తున్న అహ్మద్‌జానీ సెలవుపై వెళ్లారు. పట్టణంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటానని సీఐ రాంబాబు తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

ఎంపీడీవో శ్రీనివాసరావు



కర్లపాలెం: సమస్యలతో సచివాలయాలకు వచ్చే గ్రామస్తులకు మెరుగైన సేవలందించాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. ఎంపీడీవో శుక్రవారం కర్లపాలెం గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. ఇంటి పన్నులు నూరుశాతం వసూలు చేయాలన్నారు. ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్యం పనులు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీత, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

డ్రైయిన్లు ఇలా.. సాగు ఎలా..?!



వెదుళ్ళపల్లి డ్రైన్‌లో నిండిపోయిన పూడిక



ఈస్ట్‌చాంపు డ్రైనేజీలో పూడిక

- పూడికతీత పనులను పట్టించుకోని డ్రైనేజీ విభాగం
- ప్రతి ఏడాది ముంపునకు గురవుతున్నప్పటికీ చర్యలు శూన్యం
- కట్టల ఎత్తులు పెంచటంతోనే సరి

బాపట్ల: బాపట్ల జిల్లాలో రైతుల పరిస్థితి అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్న చందంగా మారింది. నియోజకవర్గం చుట్టు పక్కల జీవ నదులు మాదిరిగా జిల్లాలోని పలు చోట్ల నుంచి సముద్రంలో కలిసేందుకు డ్రైనేజీలు వెళుతున్నప్పటికీ వాటిని సాగు నీరుగా ఉపయోగించుకోవటంలో సఫలీకృతం కాలేకపోతున్నారు. కనీసం డ్రైనేజీల్లో పూడిక తీత పనులైనా చేపడితే కొద్దిపాటి నీరైనా సముద్రం పాలు కాకుండా చూసుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ ఆ పనులు చేపట్టేందుకు ఎవరు ముందుకు రావటం లేదు. ఈ డ్రైనేజీల్లో ఇసుక మేటలు వేసి భారీగా పూడికలు ఏర్పడ్డాయి. కేవలం డ్రైనేజీలపై కట్టలు ఎత్తులు పెంచటంతోనే సరిపెట్టి అటు నీరు నిల్వ ఉంచకపోగా భారీ వర్షాలకు ముంపునీరు, పంట కాలువల్లోని మురుగునీరు బయటకు వెళ్లలేక పొలాల్లోనే నిల్వ ఉండిపోతున్నాయి.

వెదుళ్ళపల్లి డ్రైన్ కింద వరి సాగు

పర్చూరు డివిజన్‌లోని కొంత ప్రాంతాన్ని కలుపుకుని వెదుళ్ళపల్లి నుంచి సముద్రంలో కలిసే వెదుళ్ళపల్లి డ్రైన్‌లో భారీగా పూడిక పేరుకుపోయింది. ఈ డ్రైనేజీ కింద పలు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు ఉన్నాయి. వీటితో వరి సాగు చేస్తుంటారు. ఈ డ్రైనేజీ పరిధిలోకి కంకటపాలెం, మురుకొండపాడు, బేతపూడి, స్టువర్టుపురం, దరివాదకొత్తపాలెం, మరుప్రోలువారిపాలెం పొలాల్లోని నీరు వెళ్లేందుకు అవకాశం ఉంది. అయినప్పటికీ ఈ డ్రైనేజీ గురించి పట్టించుకునే వారు లేకుండాపోయారు.

నల్లమడ వాగు పరిస్థితి మరీ దారుణం

గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని నల్లమడ వాగు ఒక రకంగా జీవ నదిగా చెప్పవచ్చు. ఈ వాగు కింద కొమ్మమూరు కాలువ ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో నల్లమడ నుంచి క్యాచ్‌లాకులు ఉన్నాయి. నల్లమడ అడవుల్లో నుంచి వచ్చే ఈ వాగు అప్పాపురం వద్ద కనీసం 20 అడుగుల ఎత్తులో భారీగా ప్రవహిస్తుంది. దీని కట్టలు సరిగా లేకపోవటంతో జిల్లెళ్ళమూడి, మూలపాలెం, బాపట్లలోని కొంతభాగం పొలాలు పూర్తిగా మునిగిపోతున్నాయి. ముంపును ఎదుర్కొనే విధంగా దీనిలో పూడికతీత పనులు చేపడితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అదే విధంగా పేర్లీ డ్రైనేజీ, తుంగభద్ర, ఈస్ట్ చాంపు డ్రైనేజీలో కూడా పూడిక తీత పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది. సాధారణంగా వేసవి కాలంలో పూడిక తీత పనులు చేపడితే వర్షాకాలానికి నీటి నిల్వలతో పాటు రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. అయితే ఈ ఏడాది కనీసం వాటికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా ప్రతిపాదనలకు నోచుకోకపోవటంతో ఈ ఏడాది కూడా పూడికతీత పనులకు ముహూర్తం లేనట్లేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యున్నతికి పాటుపడాలి

వేమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు



కొల్లూరు : వైఎస్సార్‌సీపీ విభాగాలలో పదవులు పొందిన నాయకులు పార్టీ అభ్యున్నతికి నిరంతరం శక్తి వంచన మేరకు పాటుపడాలని వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. ఇటీవల నూతనంగా నియమించిన జిల్లా కమిటీలో జనరల్ సెక్రటరీగా పదవి పొందిన బిట్రగుంట సత్యనారాయణ మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి తనకు పదవి దక్కడంలో కీలకపాత్ర పోషించిన వరికూటిని కృతజ్ఞతా పూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ నిస్వార్థంగా పార్టీ కోసం పాటుపడిన వ్యక్తులకు పదవులు లభిస్తాయన్నారు.ఎంపీటీసీ సభ్యురాలు బుల్లా నవరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు కూచిపూడి మోషే, గాజుల శ్రీనివాసరావు, చిలకా ప్రకాశం, సవరాల నాంచారయ్య, ఆళ్లమూడి మధు, చిల్లా సత్యనారాయణ, దాసరి ఏకోబు, దున్నా వెంకయ్య, మేకతోటి ఏలియ్య, దున్నా బాబురావు పాల్గొన్నారు.

ఇసుక లారీ బోల్తా

వేమూరు: ఇసుక లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. కొల్లూరు నుంచి ఇసుక లారీ గుంటూరు వెళుతుంది. సామాజిక ఆరోగ్య కేంద్రం సమీపంలో లారీ అదుపు తప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. లారీ చక్రాలు పంట కాలువలోకి వెళ్లడం వల్ల ప్రమాదం తప్పింది. డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం



రేపల్లె రూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రేపల్లె నియోజకవర్గంలోని వివిధ మండలాలకు పార్టీ అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ రేపల్లె పట్టణ అధ్యక్షుడిగా కరేటి శేషగిరిరావు, రేపల్లె రూరల్ అధ్యక్షుడిగా మేడికొండ అనిల్‌కుమార్, నగరం మండల అధ్యక్షుడిగా ఇంకొల్లు రామకృష్ణ, నిజాంపట్నం మండల అధ్యక్షుడిగా యార్లగడ్డ వెంకట రాంబాబు, చెరుకుపల్లి మండల అధ్యక్షుడిగా డుండి వెంకట రామిరెడ్డిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నూతనంగా ఎన్నికైన పార్టీ అధ్యక్షులకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు.

బాపట్ల మండల పార్టీ అధ్యక్షుడిగా మరుప్రోలు

బాపట్ల: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాపట్ల మండల, పట్టణ అధ్యక్షులను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. బాపట్ల మండల పార్టీ అధ్యక్షుడిగా మరుప్రోలు కొండలరెడ్డి, పట్టణ అధ్యక్షుడిగా కాగిత సుధీర్‌బాబు, కర్లపాలెం మండల అధ్యక్షుడిగా యల్లావుల ఏడుకొండలు, పిట్టలవానిపాలెం మండల అధ్యక్షుడిగా ఉయ్యూరు లీలాశ్రీనివాసరెడ్డిని ఎంపిక చేశారు. ఈ మేరకు పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

మండల పార్టీ అధ్యక్షుడిగా సుబ్బారావు

వేమూరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వేమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుల పేర్లు విడదల చేయడం జరిగిందని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమూరు మండల పార్టీ అధ్యక్షుడిగా దాది సుబ్బారావు, కొల్లూరు మండల పార్టీ అధ్యక్షుడిగా మల్లేశ్వరరావు, భట్టిప్రోలు మండల పార్టీ అధ్యక్షుడిగా పడమట శ్రీనివాసరరావు, అమర్తలూరు మండల పార్టీ అధ్యక్షుడిగా గొటిపాటి హేమచంద్ర శ్రీనివాస్, చుండూరు మండల పార్టీ అధ్యక్షుడిగా అనపురెడ్డి రఘురామిరెడ్డిలను నియమించడమైందని ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్లపాలెం: చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. కర్లపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు బాపట్ల రూరల్ మండలం కొండుబొట్లవారిపాలెంకు చెందిన పల్లప్రోలు సాంబశివరావు(55) ఈ నెల 5వ తేదీన కర్లపాలెం వచ్చి తిరిగి వెళుతుండగా కర్లపాలెం సెంటర్‌లో ఎదురుగా వస్తున్న మరో వాహనం ఢీ కొనటంతో సాంబశివరావుకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను పటిష్టం చేయాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి

బాపట్ల : ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను పటిష్టం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి మంజుల పేర్కొన్నారు. ఏపీ టీచర్స్ ఫెడరేషన్ బాపట్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో కామ్రేడ్ నూతలపాటి పరమేశ్వరరావు తృతీయ వర్ధంతి సందర్భంగా విద్యా సదస్సు బాపట్లలో శుక్రవారం సూర్యకాళీ ఫంక్షన్ ప్లాజాలో జరిగింది. ప్రారంభ సమావేశానికి జిల్లా శాఖ అధ్యక్షులు ఏ శేఖర్‌బాబు అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మంజుల మాట్లాడుతూ తొలితరం మలితరంల మధ్య వారధిగా నూతలపాటి పరమేశ్వరరావు తమ ప్రజ్ఞాపాటవాలతో క్రియాశీల కార్యకర్తల నిర్మాణంలో అద్భుతమైన పాత్ర పోషించారని, ప్రభుత్వ విద్య పటిష్టతకు కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పి.డి.సోషలిజం మాట్లాడుతూ మహాసభల నిర్వహణ, ఉపాధ్యాయ పత్రికను నిరాటంకంగా వెలువరించడం, డైరీలు, జీవోల పుస్తకాలు ప్రచురణలతో పరమేశ్వరరావు నిరంతర పర్యవేక్షణ ఉపాధ్యాయ ఉద్యమానికి ఎంతగానో దోహదపడిందన్నారు.

రాష్ట్ర కార్యదర్శి చాంద్ బాషా మాట్లాడుతూ విద్యారంగ ప్రగతికి, ఉపాధ్యాయ సంక్షేమానికి ఏపీటీఎఫ్ రాజీలేని పోరాటం చేస్తుందని, 117 జీవో రద్దు ఒక ప్రహసనంలా ఉందని, సమస్యల పరిష్కారం కోసం ఉద్యమమే శరణ్యమని అన్నారు. ముఖ్య వక్త ఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు షేక్ జిలాని మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమంలో ఏపీటీఎఫ్ కీలక శక్తిగా పనిచేస్తుందని, ఉద్యమ నిర్మాణ విస్తరణలో కామ్రేడ్ నూతలపాటి పరమేశ్వరరావు క్రియాశీల పాత్రను పోషించారని ఆయన ఆశయాలను సాధించటం కోసం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిలానీ, పద్మావతి, బసవలింగారావు, ఖాలిద్, రవికుమార్, శ్రీనివాసులు, నేతాంజనేయ ప్రసాద్, విజయసారథి, రఘుబాబు పాల్గొన్నారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి

గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

రేపల్లె రూరల్: సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశిని వైకుంఠ ఏకాదశి, ముక్కోటి ఏకాదశి అంటారని ప్రతీతి. ఈ రోజున వైకుంఠ ఉత్తర ద్వార వాకిళ్లు తెరుచుకుంటాయి. దీంతో వైష్ణవాలయాల్లో స్వామి వారిని భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకుంటారు. ఈ ద్వారం నుంచి మహావిష్ణువు గరుడ వాహనధారుడై మూడుకోట్ల దేవతలతో భూలోకానికి వచ్చి భక్తులకు దర్శనమిస్తాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ రోజున స్వామివారిని దర్శించుకుంటే వైకుంఠ ప్రాప్తి కలుగుతుందన్న నమ్మకంతో భక్తులు వేకువ జాము నుంచే ఆలయాల వద్ద బారులు తీరారు. శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలను ఆయా ఆలయాల అర్చకులు వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని రైలుపేటలో వేంచేసియున్న సీతా లక్ష్మణ హనుమత్ సమేత పట్టాభి రామస్వామి ఆలయం, కోదండరామస్వామి ఆలయం, ఓల్డ్‌టౌన్‌లోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం, ఉప్పూడి రోడ్డులోని లక్ష్మీ గోద సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామునే స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయాల కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు

జంపని(వేమూరు): మండలంలోని పలు గ్రామాల్లో విష్ణు ఆలయాలలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగిందని పూజారి శ్రీనివాసమూర్తి తెలిపారు. జంపని చెన్న కేశవాలయంలో తెల్లవారుజామున సుప్రభాత సేవ అనంతరం స్వామి వారికి గోదా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి తిరుప్పావై గోష్ఠి నిర్వహించారు. శ్రీ భూ సహిత చెన్నకేశవస్వామికి పల్లకి ఉత్సవం జరిపి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానముల దాస సాహిత్య ప్రాజెక్ట్ భజన సమాజం వారు విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. వేమూరు, చావలి, చదలవాడ, పెరవలి, అబ్బనగూడవల్లి గ్రామాల్లోని ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఉప్పూడి రోడ్డులోని లక్ష్మీ గోద సమేత వేంకటేశ్వరుని దర్శించుకుంటున్న భక్తులు
ఉత్తర ద్వార దర్శనమిచ్చిన లక్ష్మీనరసింహ స్వామి

అల్లూరు(కర్లపాలెం): ముక్కోటి ఏకాదశి సందర్భంగా అల్లూరు గ్రామంలో రాజ్యలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి భక్తులకు శుక్రవారం ఉత్తర ద్వార దర్శనమిచ్చారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజామున 5 గంటల నుంచి బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో ఉత్తర ద్వారం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై నరసింహస్వామి వారు రాజ్యలక్ష్మీ సమేతంగా గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ప్రసాదాలను పంచి పెట్టారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం స్వామి వారి నగరోత్సవం కనుల పండువగా నిర్వహించారు. బేతాళం వెంకట నరసరాజు, దాట్ల విజయవర్మరాజు, దంతులూరి సుధాకరరాజు దంపతులు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు.



లక్ష్మీ గోద సమేత వేంకటేశ్వరస్వామి

వైభవంగా ముక్కోటి ఏకాదశి

బాపట్ల: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని పట్టణ, మండలంలోని అన్ని దేవాలయాలు భక్తులతో శుక్రవారం కిటకిటలాడాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో క్యూ కట్టారు. క్షీరభావన్నారాయణ స్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారికి పట్టణంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని గంగా పర్వతవర్ధనీ సమేత సోమేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బాబీ ముక్కోటి దేవతలు విష్ణుమూర్తిని ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనం చేయటం వలన ముక్కోటి ఏకాదశి అని, వైకుంఠం నుంచి దిగివచ్చి విష్ణుమూర్తి మురాసురుడు అనే రాక్షసుణ్ని సంహరించడం వలన వైకుంఠ ఏకాదశిగా పేరు వచ్చిందన్నారు. స్వామివారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ఊరేగింపు నిర్వహించారు. అలాగే పట్టణంలోని త్యాగరాయనగర్, ఎస్ఎన్‌పీ అగ్రహారం, పాతబస్టాండ్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో, కాకుమానువారిపాలెం, కొత్రావారివీధి, బెస్తపాలెం, చీలురోడ్డు, శృంగారపురంలోని రామాలయాలయాలతోపాటు, అయ్యప్పస్వామి దేవాలయంలో భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ప్రత్యేక పూజలనంతరం స్వామి వార్లకు పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు న్నారు.



రేపల్లెలో కోదండ రామస్వామి



కొల్లూరు వైష్ణావాలయంలో...

భక్తులతో కిటకిటలాడిన వైష్ణవాలయాలు

కొల్లూరు : ముక్కోటి ఏకాదశిని పునస్కరించుకొని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తడంతో ఆలయ ప్రాంగణం కోలహలంగా మారింది. శుక్రవారం కొల్లూరు వైష్ణవాలయానికి తెల్లవారుజాము నుంచి భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు బారులు తీరారు. ప్రత్యేకంగా అలంకరించిన దేవతా మూర్తులను దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు

కర్లపాలెం: అగ్రహారం గ్రామంలో వేంచేసియున్న భూనీలా సమేత జనార్ధనస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని భక్తులు తెల్లవారుజామున స్వామికి పూజలు చేసి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ముక్కోటి, వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పెనుమెత్స వెంకటరామరాజు, సామంతపూడి వెంకటరామరాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు బృందావనం శ్రీనివాసాచార్యులు ఆండాళ్ తయార్ గోష్ఠి నిర్వహించారు. విష్ణు సహస్ర నామ పారాయణం, తిరుప్పావై, వేద పఠనం జరిగాయి. అనంతరం స్వామి వారికి నగరోత్సవం నిర్వహించారు. ఏట్రవారిపాలెం పంచాయతీ కొత్తరాజుపాలెంలోని కోదండరామస్వామి ఆలయం, బుద్ధాంలోని రామాలయంలో విశేష పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి పర్వదినం

నగరం: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని శుక్రవారం మండలంలోని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జాము నుంచే ఆలయాలలో భక్తుల సందడి నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం, వీరాంజనేయస్వామి ఆలయం, పెద్దవరంలోని రంగనాయకస్వామి, పూడివాడలోని వేణుగోపాలస్వామి దేవస్థానాలలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ముక్కోటి ఏకాదశి రోజున విష్ణుమూర్తిని ఉత్తర ద్వార దర్శనం చేసుకుని పూజిస్తే సకల పాపాలు తొలగి పుణ్యం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.



కొల్లూరు వైష్ణవాలయం వద్ద బారులు తీరిన భక్తులు



జంపనిలోని చెన్నకేశవ ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిస్తున్న స్వామి వారు

ముక్కోటి ఏకాదశి పూజాలు

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండలం మోపర్రు గ్రామంలో వేంచేసియున్న రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని ఉదయం 4 గంటలకు స్వామి వారికి విశేషార్చన, విశేష అలంకరణ అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఉదయం 9 గంటలకు వేణుగోపాలస్వామి గ్రామోత్సవం, 11 గంటలకు వేణుగోపాలస్వామి భక్త మండలి వారిచే భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణ జరిగాయి. సాయంత్రం 6.30 గంటలకు స్థానిక భక్త మండలిచే నామ సంకీర్తన, ఏకాదశి జాగరణ సందర్భంగా స్వామి వారి ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు నిర్వహించారు.



రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి



భావన్నారాయణస్వామి ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు



భూ నీలా సమేత జనార్ధనస్వామి ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు



మోపర్రు రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

నిరుపేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలి

మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

బాపట్ల: కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపులో భాగంగా తహసీల్దార్ కార్యాలయాల్లో పేదల నుంచి సేకరించిన అర్జీలను అధికారులకు ఇచ్చే కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. బాపట్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జల్లి విల్సన్ మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు పేదలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పట్టణంలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని అన్నారు. అధికారంలోకొచ్చి ఏడు నెలలు గడిచిన హామీ నెరవేరాలేదన్నారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జెల్డి భాగ్య శ్రీధర్ మాట్లాడుతూ ఈ రోజు చేస్తున్న ధర్నా ఆరంభం మాత్రమేనని ఎన్నికల హామీలు నెరవేర్చే వరకు పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, సీపీఐ జిల్లా పట్టణ కార్యదర్శి అశోక్, సీపీఐ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పురుగుల మందు తాగి వివాహిత మృతి

కర్లపాలెం: పురుగుల మందు తాగి వివాహిత మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు యాజలి గ్రామానికి చెందిన గౌతమి (26)ను పేరలి గ్రామానికి చెందిన నాగరాజుకు ఇచ్చి 9 ఏళ్ల క్రితం వివాహం చేశారు. అప్పటి నుంచి భార్యా భర్తలిరువురూ అనోన్యంగా కలసి మెలసి ఉంటున్నారు. గురువారం సాయంత్రం దంపతుల మధ్య మనస్పర్థలు ఏర్పడటంతో గౌతమి శుక్రవారం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం పొన్నూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. మృతురాలి తల్లి విజయలక్ష్మిఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

ముగిసిన కోటి లలితా సహస్ర నామ పారాయణ



రేపల్లె రూరల్: పట్టణంలోని రింగురోడ్డు వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కోటి లలితా సహస్ర నామ పారాయణం కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. నల్లూరు వృద్ధాశ్రమం నిర్వాహకుడు కల్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో 10 రోజులుగా మహిళలు లలితా అమ్మవారి సహస్ర నామ పారాయణం కోటిమార్లు జపించారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ అమ్మవారిని రోజుకొక ధాన్యపు రాశితో తొమ్మిది రోజుల పాటు నవధాన్యాలతో పూజించటం జరిగిందన్నారు. 10వ రోజు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలతో పాటు విశేష పూజా కార్యక్రమాలు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు తూనుగుంట్ల శ్రీనివాసరావు, ఆర్యవైశ్య మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కొప్పరావూరు రజిని, నిర్వాహకులు మద్ది పద్మజ, ఎంబీఎల్ నారాయణమూర్తి, కారుమూరి నాగలీల, చంద్రకిరణ్, నిడమానూరు నగరాజ, గుండు పుష్పవల్లి, రామరత్నం,స్వతంత్ర లక్ష్మి పాల్గొన్నారు.